క్లుప్తంగా

పట్టణ సీఐగా వెంకటయ్య బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకటయ్య

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా వెంకటయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన వెంకటయ్య ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అర్వపల్లి ఎస్‌ఐగా సైదులు


ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సైదులు

అర్వపల్లి : అర్వపల్లి ఎస్‌ఐగా ఈట సైదులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సూర్యాపేట టౌన్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న సీహెచ్.బాలకృష్ణ నల్లగొండ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ సైదులు మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని, పోలీసులకు ప్రజలు అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.

రైతులకు అందుబాటులో యూరియా

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని నారాయణగూడెం, అనంతారం గ్రామాల్లోని పీఏసీఎస్ కార్యాయాల్లో రైతులకు అందుబాటులో యూరియా ఉన్నట్లు సీఈఓ ఆలకుంట్ల సైదులు బుధవారం తెలిపారు. యూరియా కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జీరాక్స్‌లు తీసుకొని రావాలని కోరారు. మొదటి విడత ఎకరానికి ఒక బస్తా మాత్రమే అందజేస్తామని ఆయన తెలిపారు.

హామీలు అమలు అయ్యేలా చూడాలని వినతి


ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన ఉద్యమకారులు

అర్వపల్లి : తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ అంజిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్‌లో బుధవారం ఎమ్మెల్సీ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. మలిదశ ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, 250గజాల ఇంటిస్థలాన్ని కేటాయించాలని, నెలకు రూ.25వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. అలాగే ఈ నెల 5న ఓయూలో జరిగే దీక్షకు హాజరుకావాలని కోదండరాంను కోరినట్లు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర కోశాధికారి కుదురుపాక ఉదయ్, రమణ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

పెన్‌పహాడ్ : విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని మహ్మదాపురం ఆవాసం లాల్‌సింగ్‌తండాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య మోహన్ తన ఆవును కొట్టంలో కట్టివేశాడు. ప్రమాదవశాత్తు ఎల్‌టీ విద్యుత్ తీగ తెగి ఆవుపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.45వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి అనంతుల వెంకన్న పరిశీలించారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న తిర్మల్‌రావు

నూతనకల్ : మండలంలోని యడవెల్లి గ్రామానికి చెందిన పిట్టల వీరయ్య ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిర్మల్‌రావు బుధవారం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం, క్వింటా బియ్యం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ వేల్పుల నరేష్, గాజుల ఉపేందర్, బొడ్డు వెంకన్న, వేల్పుల వెంకన్న, ప్రవీణ్, గాజుల సుదర్శన్, మల్లయ్య, వీరస్వామి పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అర్వపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ అనిత అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్ బొమ్మల ద్వారా పిల్లలకు చేస్తున్న విద్యాబోధనను పరిశీలించారు. అలాగే పిల్లల బరువులు, ఎత్తును పరిశీలించారు. కార్యక్రమంలో టీచర్ అనిరెడ్డి పుష్పలత, ఆయా, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం


నర్సరీలో పెరిగిన మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు


గుంతలు తీస్తున్న ఉపాధిహామీ కూలీలు

- లక్షా 64వేల మొక్కలు నాటడమే లక్ష్యం
- ఒక్కో నర్సరీలో 11వేల వరకు పెంపకం
- గ్రామాల్లో గుంతలు తీసే పనులు ప్రారంభించిన అధికారులు

పెన్‌పహాడ్ : పల్లెల్లో పచ్చదనం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందులో భాగంగా గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమంతో ఈ ఏడాది వానాకాలంలో మొక్కలు నాటేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వం తెలంగాణ హరితహారం పేరుతో నాటిన మొక్కలు పెరిగి చెట్లుగా ఎదగడంతో గ్రామాల్లో పచ్చదనం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో పల్లెల్లో, రహదారుల వెంట నాటిన మొక్కలు నీడనిస్తున్నాయి. ఇదే కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటుతున్నారు. ఈ క్రమంలో జూలైలో మొక్కలు నాటేందుకు సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

29 గ్రామ పంచాయతీల్లో..

ఈ ఏడాది కూడా వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు నర్సరీల్లో పెంచిన మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వర్షాలతో పాటు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వారంలో మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు సమాయత్తమవుతున్నారు. మండలంలోని 29 గ్రామాల్లో మొక్కలు పెంచేందుకు నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క నర్సరీలో 8నుంచి 11వేల మొక్కల చొప్పున మండలంలో మొత్తం లక్షా 64వేల మొక్కలు ఉపాధిహామీ పథకంలో భాగంగా నర్సరీలో పెంచారు. లక్ష్యానికి అనుగుణంగా అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను ఇప్పటికే అధికారులు గుర్తించి గ్రామాల్లో గుంతలు తీసే ప్రక్రియను కూడా ప్రారంభించారు. వర్షాలు కురుస్తుండడంతో నాటే కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ఇప్పటికే అధికారులు అనువైన స్థలాలను గర్తించారు.

ఇళ్లల్లో పెంచేందుకు వీలుగా..

గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలో ఇళ్లల్లో పెంచేందుకు వీలుగా గులాబీ, మల్లె, జామ, ధానిమ్మ, తులసి, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, అల్లనేరేడు వంటి 20రకాల మొక్కలతో పాటు ఇతర ప్రదేశాల్లో ఈత, తాటి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి.

ప్రతి గ్రామానికి పంపిణీ చేస్తాం



ప్రతి గ్రామంలో మొక్కల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ ఆదేశాల రాగానే మొక్కలు నాటే కార్యక్రమం చేపడతాం. ప్రతి గ్రామంలో ఇచ్చిన లక్ష్యం మేరకు నాటిస్తాం. ప్రతి గ్రామంలోని నర్సరీల్లో మొక్కలు పెంచి సిద్ధంగా ఉంచాం.

– వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ

ఇందిరమ్మ రాజ్యంతోనే గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే మందుల సామేల్


గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మద్దిరాల : ఇందిరమ్మ రాజ్యంతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.20లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం 10సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు రుణమాఫీ, ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ ఇలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదని అన్నారు. నిరుద్యోగులకు కొలువులు, అర్హులైన నిరుపేదలకు నూతన రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో రూ.1400కోట్ల అభివృద్ధి పనులను చేసినట్లు తెలిపారు. గ్రామంలో 6 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో వాటికి తోడు త్వరలో మరో 12ఇండ్లను కూడా ఇస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామానికి ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.10లక్షలు ఉండగా వాటికి మరో రూ.10లక్షల నిధులను కేటాయించి నూతన సీసీరోడ్డు వేసి డ్రెయినేజీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పచ్చిపాల వెంకన్న, బొబ్బిలి వెంకన్న, తాళ్లపెల్లి సురేష్, బర్పటి ఉపేందర్, శ్యాంరెడ్డి, అంజయ్య, చామకూరి శ్రీనివాస్, వల్లపు రమేష్, ఎల్లు అశోక్‌రెడ్డి, కోడి శ్రీశైలం, కుందూరు చంద్రశేఖర్‌రెడ్డి, పొన్నం శ్రీను, గుండ్ల ఉపేందర్, కోడి లింగయ్య, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

రంగమ్మ చిత్రపటానికి నివాళి


నివాళులర్పిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు

సూర్యాపేట : మండల పరిధిలోని రామారం గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధురాలు ఉప్పు రంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం గ్రామంలో ఆమె చిత్రపటానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు ధరావత్ వెంకన్న, వెలుగు వెంకన్న, షఫీ, వల్దాస్ దేవేందర్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రుణమేళాను సద్వినియోగం చేసుకోవాలి



రుణమేళాలో పాల్గొని రుణ మంజూరు పత్రం అందజేస్తున్న సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్

సూర్యాపేట : సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రుణమేళాను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని సుధా బ్యాంకు వద్ద నిర్వహించిన రుణ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో 16 రకాల రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ రుణ మేళాలో వివిధ రకాల రుణాలను సులభంగా పొందేందుకు బ్యాంకు మేనేజర్, సిబ్బందిని సంప్రదిస్తే వారి అవసరాల మేరకు కాలయాపన చేయకుండా రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. రుణాల కోసం వివిధ బ్యాంకులకు వెళ్తే అప్లికేషన్ తీసుకొని పలు రకాల కారణాలతో నెలల తరబడి జాప్యం చేస్తున్న సందర్భంలో స్థానికంగా ఉన్న సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రజల అవసరాలను తీర్చేందుకు వారంలో రుణాలు మంజూరు చేస్తామన్నారు. అత్యవసరమైతే రెండు మూడు రోజుల్లో కూడా రుణాల మంజూరుకు సహకరిస్తామన్నారు. ఇంటి మరమ్మతులకు, విస్తరణకు, చిరు వ్యాపారాలకు, దుకాణాదారులకు, చేతివృత్తిదారులకు 12శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. టర్మ్‌లోన్లు, వాహన రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలు, గిడ్డంగి సర్టిఫికెట్ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ పతాని సైదులు, ఫీల్డ్ ఆఫీసర్ మేకల కేశవులు, సిబ్బంది మారినేని నవీన్, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి

సూర్యాపేట : వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి సూచించారు. 100రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం పట్టణంలోని 28వ వార్డులో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంట్లోని చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అప్పగించాలని, కుక్కలకు బెల్టులు వేసి, అవసరమైన టీకాలు వేయించుకోవాలన్నారు. అలాగే వార్డులో మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీటిని పరీక్షించి, శుద్ధమైన నీరు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. నిరుపేద మహిళలకు స్వయం సహాయక సంఘాలపై అవగాహన కల్పించి చిరు వ్యాపారులను గుర్తించి స్ట్రీట్ వెండర్ సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వ్యాపార సంస్థల నుంచి ట్రేడ్ లైసెన్స్‌లు వసూలు చేస్తున్నామని, రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని శిథిలావస్థలో ఉన్న భవనాల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, మాజీ కౌన్సిలర్ రాపర్తి శ్రీను, మున్సిపల్ డీఈ సత్యరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఏఈ తిరుమలయ్య, టీఎంసీ శ్వేత, ఆర్‌పిలు నాగయ్య, శ్రీను, గౌసుద్దీన్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి, వార్డు అధికారి నుస్రత్ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి పూజలు


పూజలు చేస్తున్న మహిళలు

సూర్యాపేట : పట్టణంలోని సంతోషిమాత ఆలయంలో ఆషాడమాసం సందర్భంగా శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం 7వ రోజు మత్స్య వారాహి దేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయం అర్చకుడు బట్టారం వంశీకృష్ణశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రుల్లో విశేషంగా ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో అర్చనలు జరిపారు. అనంతరం మత్స్య వారాహి దేవి అమ్మవారి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. భక్తులు అమ్మవారికి కీర్తిస్తూ పాటలు పాడారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు నూక వెంకటేశ్వంగుప్తా, ప్రధాన కార్యదర్శి బ్రాహ్మడ్లపల్లి మురళీధర్, కమిటీ సభ్యులు బజ్జూరి శ్రీనివాసు, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం, దేవాలయ క్లర్క్ దులుసోజు జలంధర్, శివ పార్వతి, గజ్జి నీలిమ, సారగుండ్ల సరిత, అరుణ, విజేత, ఉమామహేశ్వరి, స్వాతి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా

సూర్యాపేట అర్బన్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు పూర్తికావస్తున్నా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా కాలయాపన చేస్తుందని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. బుధవారం పట్టణంలో డిగ్రీ కళాశాలల బంద్ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. రూ.7వేల 200కోట్లు పెండింగ్‌లో ఉంచి ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులను విద్యను దూరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్, నాయకులు సంధ్య, మానస, స్వాతి, మహేశ్వరి, లావణ్య, నందిని, ప్రసన్న, యశ్వంత్, మహేష్, నవీన్, వినయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు


ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న సంధ్యారాణి

సూర్యాపేట : మండలంలోని వివిధ పాఠశాలల్లో బుధవారం తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు పర్వతం సంధ్యారాణి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలను సందర్శించి వివిధ ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు క్యాష్ లెస్ హెల్త్‌కార్డులను మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మీడియా ఇన్‌చార్జ్ పోతుగంటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బానోతు పూల్‌సింగ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వనం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే అభివృద్ధి



నాగారం : లక్ష్మాపురంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్


సూర్యాపేట : మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్


సూర్యాపేటటౌన్ : మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

నాగారం : గ్రామాల్లో ప్రశాంత వాతావరణం, శాంతిభద్రతలు అదుపులో ఉంటే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని సూర్యాపేట డీఎస్పీ వడ్డే ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో నిర్వహించిన పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల రక్షణ కోసమే పోలీసు వ్యవస్థ ఉందని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల పట్ల, యువత గంజాయి, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ప్రతిఒక్కరూ ఐక్యంగా ఉండాలన్నారు. అనంతరం పోలీసు కళాబృందం సభ్యులు సైబర్ నేరాలపై, ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్ మత్తు మందులపై, రోడ్డు ప్రమాదాలపై కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.ఐలయ్య, పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, చారి, కృష్ణ, పోలీస్ సిబ్బంది రవీందర్, శ్రీకాంత్, సైదులు, కార్యదర్శి గోపి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సూర్యాపేట : ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. మండల పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామస్తులకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని, క్షణికావేశంతో, స్వార్థంతో, అత్యాశతో ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని, నేరాలకు పాల్పడవద్దని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా గ్రామంలో నిఘా ఉంచినట్లు తెలిపారు. అదే విధంగా సైబర్ మోసాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ బాలునాయక్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవు

సూర్యాపేటటౌన్ : నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవని పట్టణ సీఐ వెంకటయ్య అన్నారు. బుధవారం రాత్రి పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ మొదటి విడతలో పట్టణ పోలీస్‌స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో యువత గంజాయి మత్తులో పడి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. సైబర్ మోసాలను గ్రహించాలని, ఎవరైనా అపరిచితులు ఫోన్ చేసి వ్యక్తిగత బ్యాంకు వివరాలను అడిగితే తెలపొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేంద్రనాథ్, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి


పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాలు, క్రీడా వస్తువులు అందజేస్తున్న దాత కృష్ణకుమార్

పెన్‌పహాడ్ : విద్యార్థులు క్రీడలతో పాటు మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రవీందర్‌బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అనంతారం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, విభిన్న పాత్రాభియన కళాకారులు, సమాజ సేవకుడు, పర్యావరణ వేత్త పెండెం కృష్ణకుమార్ విచ్చేసి అవసరమైన జాతీయ నాయకుల చిత్రపటాలు, ఆటవస్తువులు, వాటర్‌క్యాన్, మెడికల్ కిట్టు, వరల్డ్ మ్యాప్, ఇండియా, తెలంగాణ మ్యాప్‌లు, క్లాత్ సంచులు బహూకరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నో ప్రభుత్వ పాఠశాలల్లో సేవలందిస్తూ పర్యావరణం కోసం లక్షల క్లాత్ బ్యాగులు తన సొంత ఖర్చులతో ఇప్పటి వరకు అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వరి, లక్ష్మయ్య, ఉపేందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ అలీమా, విజయలక్ష్మి, పీడీ ప్రమీల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైవేపై సెంట్రల్ లైట్ల పునరుద్ధరణ


హైవేపై వెలుగుతున్న సెంట్రల్ లైట్లు

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : అర్వపల్లి పట్టణంలోని సూర్యాపేట–జనగామ రోడ్డులో హైవేపై సెంట్రల్ లైట్లు కొన్ని రోజులుగా వెలగడంలేదు. దీంతో గత నెల 23న అంధకారంలో అర్వపల్లి రోడ్లు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి హైవే అధికారులు బుధవారం స్పందించారు. వాటిని మరమ్మతు చేసి పునరుద్ధరించారు. దీంతో హైవేపై అంధకారం వీడింది.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం


సూర్యాపేట అర్బన్ : సమావేశంలో మాట్లాడుతున్న గంట నాగయ్య

సూర్యాపేట అర్బన్ : దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికవర్గం 50కోట్లపైగా ఉన్నారని, వారికి ఉన్న హక్కులను మోదీ ప్రభుత్వం కాలరాస్తున్నారని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ పరిశ్రమల రక్షణకై, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని అన్నారు. కార్మికుల హక్కుల కోసం ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రవీందర్, స్టాఫ్‌నర్స్ సుజాతకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 20రోజులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు కవిత, వెంకటరమణ, కవిత, నీలా, రమణ, జ్యోతి ఉన్నారు.

కాంట్రాక్ కార్మికుల వేతనాలు పెంచాలి

సూర్యాపేట : పట్టణంలోని మెడికల్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వ వైద్య కళాశాల కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో శ్రీను, నాగభూషణం, ప్రసాద్, రవి, రజియా, మణి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమరయ్య వర్ధంతిని జయప్రదం చేయాలి

మద్దిరాల : మండల కేంద్రంలో ఈ నెల 4న నిర్వహించే దొడ్డి కొమరయ్య వర్ధంతిని జయప్రదం చేయాలని గొర్రెల మేకల పెంపకందారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల లింగయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులు నడపాలని వినతి

అర్వపల్లి : నకిరేకల్ – తానంచర్ల 365 హైవేపై అర్వపల్లి మీదుగా హైదరాబాద్‌కు ప్రతిరోజు మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు నడపాలని సీపీఎం డివిజన్ నాయకుడు కొప్పోజు యాదగిరి కోరారు. ఈ మేరకు బుధవారం సూర్యాపేట డిపో అధికారులకు వినతిపత్రం పంపించారు. ప్రతిరోజు ఈరూట్లో హైదరాబాద్‌కు ఉదయం వేళలో మాత్రమే బస్సులు నడుస్తున్నాయని, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మరో రెండు బస్సులు నడిపించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరారు.

ఇసుక రిచ్‌ను మార్చాలని వినతి

నాగారం : మండలంలోని పేరబోయినగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని బిక్కేరువాగులో ఏర్పాటు చేసిన మన ఇసుక–మన వాహనం ఇసుక రిచ్‌ను మండలంలోని మరో గ్రామానికి మార్చాలని కోరుతూ బుధవారం గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మా గ్రామంలో ప్రవహిస్తున్న బిక్కేరువాగు మాకు జీవనాధారమని, మా ఊరులోని బిక్కేరువాగు అవుట్ ఆఫ్ ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తున్నందున ఇక్కడి నుంచి ఇసుక రవాణాను నిషేధించారని, గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఇసుక రిచ్‌ను ఏర్పాటు చేసి భారీగా ఇసుకను తరలించడంతో ఇసుక లేకుండా మట్టి తేలిందన్నారు. ఇసుక రిచ్‌ల ఏర్పాటుతో భూగర్భజలాలు తగ్గి సాగునీరు అందడం లేదన్నారు. అంతే కాకుండా వాహనాల రాకపోకలతో రహదారులు దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక రిచ్‌ను మరో గ్రామంలో ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జి.లక్ష్మయ్య, ఉప్పలయ్య, వి.సైదులు, డి.వెంకన్న, కె.లింగయ్య, రాములు, పి.ఉప్పలయ్య, అవిలయ్య, సోమయ్య ఉన్నారు.

ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి

అర్వపల్లి : ఇంటింటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలని ఎంపీడీఓ టి.గోపి కోరారు. మండలంలోని కాసర్లపహాడ్ గ్రామంలో బుధవారం ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధిహామీ పథకంలో ఇంకుడు గుంత నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,115 చెల్లిస్తుందన్నారు. కాసర్లపహాడ్ గ్రామంలో 100శాతం ఇంకుడు గుంతల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టీఏ నాగమణి, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ శివ, గ్రామస్తులు పాల్గొన్నారు.